క్లుప్తంగా

ఓజోన్ పరిరక్షణపై పోస్టర్ ఆవిష్కరణ



నెహ్రూ నగర్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా అంతర్జాతీయ ఓజోన్ పొర పరిరక్షణ దినోత్సవ పోటీల పోస్టర్‌ను నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆవిష్కరించారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ఐ.టి.సి. సహకారంతో 8, 9 తరగతుల విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు ఈ నెల 16న నిర్వహించనున్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, బి.శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డి.సి.పి సూరజ్, ఈఈ కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ లక్ష్మీ నారాయణ, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ నజీనా బేగం పాల్గొన్నారు.

అధికారికంగా విశ్వకర్మ జయంతి నిర్వహించాలి

నెహ్రూనగర్: మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి యజ్ఞ మహోత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా అందరి సమక్షంలో ఘనంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు పావులూరి హనుమంతరావు మంగళవారం ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వ పాలనలో సెప్టెంబర్ 17 విశ్వకర్మ భగవాన్ జయంతి మహోత్సవాలను అధికారికంగా అన్ని జిల్లా కేంద్రాలలో అధికారులు ప్రజాప్రతినిధులు, స్థానిక మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజలు అందరి సమక్షంలో అందరి భాగస్వామ్యంతో అత్యంత ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు.

పెదనందిపాడు కళాశాలకు రూ.5 లక్షల విరాళం



నగరంపాలెం: పెదనందిపాడు ఆర్ట్స్, సైన్స్ కళాశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థి, ప్రముఖ పారిశ్రామికవేత్త(కాకుమాను) నల్లమోతు వెంకటరత్తయ్య రూ.5 లక్షల విరాళం అందించారు. మంగళవారం బృందావన్‌గార్డెన్స్‌లో కళాశాల అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణకు అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల విరాళాలతో కళాశాలలో మౌలిక వసతులు కల్పిస్తామని అన్నారు. అనంతరం వెంకటరత్తయ్యను శాలువాతో సత్కరించారు. గతంలో ఇంటర్, బీకాం విద్యనభ్యసించగా, కళాశాల అభివృద్ధికి విరాళం అందించినట్లు వెంకటరత్తయ్య తెలిపారు.

శ్రీవెంకటేశ్వర ఆలయంలో ఆధ్యాత్మిక ప్రసంగం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై మంగళవారం శృంగార నైషధంలోని నలదమయంతుల చరిత్రపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. తొలుత ఆలయ పాలక మండలి వారు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ కోగంటి వేంకటశ్రీరంగనాయకి ప్రసంగిస్తూ నలుడు ధైర్యశాలి అన్నారు. గుర్రపు స్వారీలో నిష్ణాతుడని, దాతృత్వ గుణం కలవాడని పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



లక్ష్మీపురం: విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి చెందిన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలేనికి చెందిన కేతిపిల్లి నాగరాజు(36) రాడ్ బెండింగ్ పనులకు వెళ్తుంటాడు. బ్రాడీపేట 6/6 లో ఓ నిర్మాణంలో ఉన్న బిల్డింగ్ పైకి ఇనుపరాడ్‌లు పైకి లాగే క్రమంలో రాడ్ పైన ఉన్న కరెంటు తీగలకి రాడ్‌లు తగలడంతో విద్యుదాఘాతానికి గురయ్యాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా వైద్యులు మృతి చెందినట్లు వెల్లడించారు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. దీంతో మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించగా మృతుడి సోదరుడు నల్లపాటి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు.







గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరు నిరసన దీక్షకు ఏర్పాటు చేసిన శిబిరాన్ని, కుర్చీలను, సౌండ్ బాక్స్‌లను, ఫ్లెక్సీలను, జెండాలను పోలీసుల సమక్షంలో తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

ప్రోస్టేట్.. మగవారికి మాత్రమే..

- క్యాన్సర్ జబ్బు ఇది
- ఆధునిక వైద్యసేవలతో వ్యాధి నయం
- అవగాహన మాసం ఇది



గుంటూరు మెడికల్: కేవలం మగవారికి మాత్రమే వచ్చే వ్యాధుల్లో ప్రోస్టేట్ క్యాన్సర్ ఒకటి. ఈ వ్యాధి 50 సంవత్సరాలు పైబడిన వారిలో కనిపిస్తుంది. వ్యాధిని సకాలంలో గుర్తించకపోతే శరీరంలోని ఇతర అవయవాలకు సోకే ప్రమాదం ఉంది. యూరాలజీ సమస్యలతో వైద్యం కోసం వెళ్లే వారిలో ఈ వ్యాధిని గుర్తిస్తున్నారు. జీవితం అర్ధ భాగంలో సంభవించే క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరితగతిన నయం చేయవచ్చు. 1989 నుంచి ప్రతి ఏడాది సెప్టెంబర్ నెలను జాతీయ ప్రోస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన మాసంగా నిర్వహిస్తున్నారు.

వ్యాధి లక్షణాలు....

ప్రోస్టేట్ గ్రంథి మగవారి మూత్రనాళం కింద ఉంటుంది. ఇది వీర్యకణాలను మోసుకెళ్లే ద్రవపదార్థాన్ని తయారు చేయటం, లైంగిక సంపర్కం చేయటానికి దోహద పడుతుంది. సైలెంట్‌కిల్లర్‌గా పిలువబడే ప్రోస్టేట్ క్యాన్సర్ వ్యాధి సోకినట్లు తెలుసుకోవటానికి వ్యాధి లక్షణాలు చాలా వరకు బయటపడకపోవటంతో వ్యాధి నిర్ధారణ త్వరితగతిన జరగటం లేదు. అంగస్థంబన చాలా కష్టంగా ఉండటం, వీర్యస్ఖలనం చేసే సమయంలో నొప్పి రావటం, వీర్యం తగ్గిపోవటం, దీర్ఘకాలికంగా వెన్నుముక నొప్పి, తరచుగా మూత్ర విసర్జనకు వెళ్లటం, మూత్ర విసర్జనలో తొందరపాటు, అధికంగా మూత్రం వస్తున్నట్లు ఉండటం, మూత్ర విసర్జనకు చాలా సమయం తీసుకోవటం, మూత్రంలో రక్తం రావటం, రాత్రి నిద్రిస్తున్న సమయంలో మూత్ర విసర్జన వలన నిద్రాభంగం అవ్వటం, ఎముకలు నొప్పులు, కాళ్ల వాపులు, పొత్తికడుపు ఇబ్బందిగా ఉండటం లాంటి లక్షణాలు కనిపిస్తాయి.

వ్యాధి నిర్ధారణ....

క్యాన్సర్ రావటానికి నిర్దిష్ట కారణాలు తెలియవు. ఎర్రటి మాంసం, అధిక కొవ్వుశాతం ఉన్న ఉత్పత్తులు తీసుకునేవారిలో , శుభ్రం లేకుండా వండిన మాంసం ఎక్కువగా తినటం వలన వచ్చే అవకాశాలు ఉన్నాయి. 50 ఏళ్లు పైబడిన మగవారిలో ముగ్గురిలో ఇరువురు ఈ వ్యాధి బారిన పడుతున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతి బుధవారం, శనివారం యూరాలజీ వైద్య విభాగంలో వారానికి ఇద్దరు లేదా ముగ్గురు బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. జీజీహెచ్‌కు వచ్చే వారిలో అధిక శాతం మంది వ్యాధి ముదిరిన తరువాత వస్తున్నవారే. జిల్లాలో సుమారు 30 మంది యూరాలజిస్టులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్దకు ప్రతి నెలా పదిమంది వరకు బాధితులు చికిత్స కోసం వస్తున్నారు.

ముందస్తుగా పరీక్షలు చేయించుకోవాలి..



ప్రోస్టేట్ క్యాన్సర్ కుటుంబంలో ఒకరికి వస్తే ఇతరులు ముందస్తుగా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. జన్యుపరమైన కారణాలతో ఈ వ్యాధి సోకుతుంది. ప్రోస్టేట్ క్యాన్సర్‌ను సీరంపిఎస్ఏ పరీక్ష ద్వారా వ్యాధి వస్తుందా లేదా అనే విషయాన్ని నిర్ధారించవచ్చు. ఒత్తిడి వలన క్యాన్సర్ పెరిగే ప్రమాదం ఉంది. యోగా, వ్యాయామం చేయటం మంచిది. క్రమం తప్పకుండా వేళకు భోజనం చేయటం, క్యాన్సర్‌ను చంపే ఆహారమైన క్యాబేజ్, క్యాలీఫ్లవర్, పచ్చని ఆకుకూరలు, చేపలు ఆహారంలో తీసుకోవటం చాలా మంచిది. వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త పడొచ్చు.

–డాక్టర్ జొన్నకూటి కొర్నేలియస్, యూరాలజిస్ట్, గుంటూరు.

ఆధునిక చికిత్సలతో నయం చేయవచ్చు...



ప్రోస్టేట్ క్యాన్సర్ చాలా చిన్నగా పెరుగుతుంది. సకాలంలో వ్యాధిని గుర్తించి చికిత్స చేయటం వలన పూర్తిగా నయం చేయవచ్చు. క్యాన్సర్ సోకినవారు పీఎంఎస్ పెట్‌స్కాన్ పరీక్ష చేయించుకోవటం ద్వారా శరీరంలో ఏఏ భాగాల్లో క్యాన్సర్ సోకిందో తెలుసుకుని చికిత్స చేయవచ్చు. ఆపరేషన్లు, రేడియేషన్ చికిత్స, హార్మోనల్ ట్రీట్‌మెంట్, కీమోథెరపీ చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. వ్యాధిని ముందస్తుగా గుర్తించి చికిత్స అందించటం వలన బాధితుడి జీవిత కాలాన్ని పొడిగించవచ్చు.

–డాక్టర్ బైరపనేని స్రవంతి, క్యాన్సర్ వైద్య నిపుణులు, గుంటూరు

రోడ్ల మార్జిన్లు, డ్రెయిన్లపై ఆక్రమణలు తొలగించాలి

కార్పొరేషన్ కమిషనర్ పులి శ్రీనివాసులు



శానిటరీ ఇన్‌స్పెక్టర్‌తో మాట్లాడుతున్న కమిషనర్

నెహ్రూనగర్: నగరంలోని ప్రధాన రహదారులు, రోడ్డు మార్జిన్లు, డ్రెయిన్లపై ఉన్న ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగించి, మళ్లీ ఆక్రమణలు చేయకుండా పర్యవేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. నగరంలోని చుట్టుగుంట సెంటర్, నందివెలుగు రోడ్డు, యాదవ బజార్, బాలాజీ నగర్, బుడంపాడు తదితర ప్రాంతాలలో మంగళవారం ఆయన పర్యటించారు. చుట్టుగుంట సెంటర్, నందివెలుగు రోడ్డు ప్రధాన రహదారుల్లోని ఆక్రమణలను పరిశీలించి, వెంటనే ఆక్రమణలను తొలగించాలని, పట్టణ ప్రణాళిక అధికారులకు సూచించారు. వ్యాపారాలు నిర్వహించుకొనే వ్యాపారస్తులు డ్రెయిన్ల వెనుక మాత్రమే తమ వ్యాపారాలు నిర్వహించుకోవాలని కోరారు. బాలాజీ నగర్, యాదవ్ బజార్ ప్రాంతాలలో పారిశుద్ధ్యం నిర్వహణపై అందిన ఫిర్యాదును నేరుగా పరిశీలించి, సదరు ప్రాంతాలలో డ్రెయిన్స్ బ్లాక్ కావడం చూసి, వెంటనే డ్రెయిన్ బ్లాక్‌లను శుభ్రం చేయించాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను ఆదేశించారు. అనంతరం బుడంపాడు ప్రాంతంలో పర్యటించి సదరు ప్రాంతంలో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లు, డ్రెయిన్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్ఈ సుందర్రామిరెడ్డి, డీఈఈ హనీఫ్, ఏఈ ప్రసాద్ పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలి

నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కమిషనర్ పులి శ్రీనివాసులు కోరారు. నగరంలోని వెంకటరామా పౌల్ట్రీస్, వైష్ణవి కాంప్లెక్స్ నిర్వాహకులు 2025–26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పూర్తి ఆస్తి పన్నుకు సంబంధించి చెక్కులను కమిషనర్‌కు మంగళవారం అందజేశారు. వెంకటరామా పౌల్ట్రీస్ టాక్స్ రూ.25,21,397, వైష్ణవి కాంప్లెక్స్ ట్యాక్స్ రూ.13,42,143 చెక్కులను అందజేయడం అభినందనీయమన్నారు. ప్రజలు నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన పన్ను బకాయిలను ఎప్పటికప్పుడు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ ఖాజావలి పాల్గొన్నారు.

ఫిర్యాదులను 24 గంటల్లోపు పరిష్కరించాలి

డయల్ యువర్ కమిషనర్‌కు ప్రజల నుంచి అందే ఫిర్యాదులను 24 గంటల లోగా పరిష్కరించాలని, సంబంధిత విభాగాధిపతులు నేరుగా ఫిర్యాదిదారునితో మాట్లాడాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. మంగళవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో విభాగాధిపతులు, అధికారులు, సిబ్బందితో డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్, 103 కాల్ సెంటర్‌కు వచ్చిన వివిధ ఫిర్యాదుల పరిష్కారంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు, డిప్యూటీ కమిషనర్లు డి.శ్రీనివాసరావు, సిహెచ్.శ్రీనివాస్, బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, బి. శ్రీనివాసరావు, సిటీ ప్లానర్ రాంబాబు, డి.సి.పి. సూరజ్, ఈఈ కోటేశ్వర రావు, ఎంహెచ్ఓ లక్ష్మీనారాయణ, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన విన్సెంట్



విన్సెంట్‌ను అభినందిస్తున్న విజయభాస్కర్ రెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కె.విన్సెంట్ ఈనెల 7న జరిగిన రాష్ట్ర స్థాయి 2వ పికిల్ బాల్ చాంపియన్‌షిప్‌లో సత్తా చాటినట్లు పాఠశాల డైరెక్టర్ ఎస్. విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. మంగళవారం బృందావన్ గార్డెన్స్‌లోని ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విజయభాస్కర్ రెడ్డి మాట్లాడుతూ అండర్–14 బాలుర సింగిల్స్‌తో పాటు మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రథమ బహుమతి గెలుపొందినట్లు వివరించారు. అదే విధంగా ఓపెన్ మెన్ సింగిల్స్, ఓపెన్ మెన్ డబుల్స్‌లో క్వార్టర్ ఫైనల్స్‌కు చేరుకుని సర్టిఫికెట్, పతకాలను గెలుచుకున్నాడని తెలిపారు. నాణ్యమైన విద్యనందించడంతో పాటు, క్రీడలు, కళలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థుల పిల్లల ప్రతిభను వెలికితీసేందుకు ఆక్స్‌ఫర్డ్ స్కూల్స్ నిరంతరం కృషి చేస్తోందన్నారు. మరో డైరెక్టర్ ఆరోగ్య జోసఫ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థులు పాఠశాల దశలోనే అన్ని రంగాలపై ఆసక్తి చూపి, వారి ప్రతిభను ప్రదర్శించి, తగిన గుర్తింపు పొందడంలో ముందంజలో ఉండాలని అన్నారు. పాఠశాల చైర్మన్ ఎస్.ఫ్రాన్సిస్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో ఒక ప్రత్యేక ప్రతిభ దాగి ఉంటుందని, ఆ ప్రతిభను సరైన నైపుణ్యాలతో పెంపొందించుకుని ప్రోత్సహించినట్లయితే ఉన్నత స్థాయికి చేరుకోగలడని అన్నారు.

రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా గంగాధర్



గంగాధర్‌ను అభినందిస్తున్న బీజేపీ నేతలు

గుంటూరు మెడికల్: రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎంపికైన బీజేపీ రాష్ట్ర మీడియా కో కన్వీనర్ వెలగలేటి గంగాధర్‌ను అభినందన సభ మంగళవారం నిర్వహించారు. రాష్ట్ర పబ్లిసిటీ – లిటరేచర్ ప్రముఖ్ పాలపాటి రవికుమార్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. బ్రాడీపేటలోని కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి రిటైర్డ్ ప్రాసిక్యూషన్స్ డెప్యూటీ డైరెక్టర్ పాతూరి మధుసూదనరావు, రిటైర్డ్ ఎక్సైజ్ ఏఈఎస్ జి.నరసింహారావు, రియల్టర్ ఓరుగంటి లక్ష్మీనారాయణ, రిటైర్డ్ స్త్రీ శిశు సంక్షేమశాఖ సూపరింటెండెంట్ వేములూరి ప్రసాద లింగం, పార్టీ నాయకులు ఈమని మాధవరెడ్డి, ప్రతాప ప్రసాద్, సాయి రాధాకృష్ణ, మారుతి గౌతమ్‌లు వెలగలేటి గంగాధర్‌ను శాలువా, పూలబొకే అందజేసి ఘనంగా సత్కరించారు. గంగాధర్ మాట్లాడుతూ నాకు ఈపదవి రావటానికి సహకరించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్, జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్ నారాయణ, సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు, నన్ను వెన్నంటి ప్రోత్సహించిన రాష్ట్ర, జిల్లా నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

తురకపాలెంలో బొడ్రాయికి ప్రత్యేక పూజలు



గుంటూరు రూరల్: అనారోగ్యాలకు గురై వరుస మరణాలతో బెంబేలెత్తుతున్న తురకపాలెం గ్రామ ప్రజలు ఇప్పుడిప్పుడే కుదుట పడుతున్నారు. వరుస మరణాలకు మెలియాయిడోసిస్ బ్యాక్టీరియా కారణమని కొందరు వైద్యులు తెలపగా, గ్రామంలోని ప్రజలలో బొడ్రాయి పూజలు, గౌతురాళ్ల నిర్మాణంలో అపోహలపై చర్చాంశనీయమైన సంగతి తెలిసిందే. గత వారం రోజుల క్రితం గౌతురాయిని ప్రత్యేక పూజలు చేసి సరిచేశారు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలోని బొడ్రాయికి కూడా ప్రజలు ప్రత్యేక పూజలు చేసి, నైవేద్యాలు సమర్పించుకున్నారు.

ప్రజా వైతాళికుడు కాళోజీ జయంతి



మాట్లాడుతున్న రచయిత్రి, జర్నలిస్టు పింగళి భాగ్యలక్ష్మి

లక్ష్మీపురం: తన జీవిత కాలంలో జరిగిన ప్రతి ఉద్యమాన్ని ఊపిరి మార్చుకుని వాటిలో తమ వంతు పాత్రను చురుగ్గా పోషించిన కాళోజీ నారాయణ రావు రాజ్యం మీద అక్షరాయుధాలను గురి చూసి సంధించిన ప్రజా వైతాళికుడని రచయిత్రి జర్నలిస్టు పింగళి భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక అరండల్ పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు, హిందీ, ఉర్దూ, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో కవిగా ఆయన సుప్రసిద్ధులని, సమకాలీన సమాజంపై ఆయన ప్రభావం అపారమైనదన్నారు. సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి మాట్లాడుతూ ఒక సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అంటూ ఆలోచనా జ్యోతులను వెలిగించిన కాళోజీ ప్రజల పక్షం వహించిన కవిగానే కాదు, ప్రజా కాంక్షలను ఎలుగెత్తిచాటిన అసలు సిసలైన ఉద్యమ కారుడిగా ఖ్యాతిగడించారన్నారు. అనంతరం సంస్థ సభ్యులు తదితరులు నివాళులర్పించారు.

ప్రధాని మోదీ జన్మదినాన్ని ఘనంగా నిర్వహించాలి

గుంటూరు మెడికల్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా పక్షోత్సవాలు సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మేకల హనుమంతరావు లాల్ తెలిపారు. లాలుపురం రోడ్ లోని బీజేపీ జిల్లా కార్యాలయం వాజ్‌పేయి భవన్‌లో మంగళవారం జిల్లా కార్యశాల కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతి రావు అధ్యక్షత సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెప్టెంబర్ 25న పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమంతో పాటు అక్టోబర్ 2న మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అందరిలోనూ సేవ భావం పెంపొందించేలా కార్యక్రమాలను చేపట్టాలని దిశా నిర్దేశం చేశారు. మండల స్థాయిలో ముగ్గురు కమిటీలతో జిల్లా వర్క్ షాప్ కార్యక్రమం పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో సేవా పక్వాడ కార్యక్రమాల కన్వీనర్లు చరక కుమార్ గౌడ్, బజరంగ్ రామకృష్ణ, మార్తా నరేంద్ర, రాష్ట్ర ఐటీ సెల్ కన్వీనర్ మకుటం శివ, అధికార ప్రతినిధి దర్శనపు శ్రీనివాస్, పల్నాడు జిల్లా ఇన్‌చార్జి కొక్కెర శ్రీనివాస్ యాదవ్, బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంగాధర్, జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, తోట శ్రీనివాస రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులుగా ఉండాలి



ఉపాధ్యాయులతో ఏసురత్నం, కేఎస్ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డెప్యూటీ డీఈఓ ఏసురత్నం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయులు నిరంతర విద్యార్థులుగా ఉండాలని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి జి.యేసురత్నం అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఇటీవల రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకున్న ఉపాధ్యాయులకు మంగళవారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాల్లో సంఘ జిల్లా అధ్యక్షుడు యూ రాజశేఖరరావు అధ్యక్షత వహించారు. డాక్టర్ సర్వేపల్లి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. జి.యేసురత్నం మాట్లాడుతూ ఉపాధ్యాయుడు నిరంతర విద్యార్థిగా ఉండాలని, సమాచార విప్లవం, సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని బోధనను కొత్తపుంతలు తొక్కించాలని కోరారు. టెక్నాలజీ విద్యలో అవసరమేనానీ, టెక్నాలజీ ఉపాధ్యాయులకు ప్రత్యామ్నాయం కాదన్నారు. మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమాజంతో మమేకం కావాలనీ, సమాజం దృష్టిలో మంచి ఉపాధ్యాయులుగా గుర్తింపు తెచ్చుకోవాలని సూచించారు. బడికి పునాది సమాజమే అన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు హక్కులు, బాధ్యతలు రెండూ అవసరమే అన్నారు. అవి రెండూ పరస్పర సంబంధం కలిగి ఉంటాయని, రెండింటిలో ఏది కొరవడినా వ్యవస్థ విచ్ఛిన్నం అవుతుందని అన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. కళాధర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం, ప్రభుత్వ విద్యారంగం కాపాడుకునే ప్రయత్నం కోసం యూటీఎఫ్ ముందుంటుందన్నారు. ఉపాధ్యాయ, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 15వ తేదీ నుంచి యూటీఎఫ్ ఆధ్వర్యంలో 'ఉపాధ్యాయ రణభేరి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. అవార్డు గ్రహీత లకు రాష్ట్ర సహాధ్యక్షురాలు ఏఎన్ కుసుమ కుమారి, రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు సిహెచ్.ఆదినారాయణ, కె.సాంబశివ రావు, జి.వెంకటేశ్వర రావు, ఎం.గోవింద్, ఎండీ షకీలా బేగం, టి.ఆంజనేయులు, ఎ.శ్రీనివాసరావు, కె.రంగా రావు, కె.కేదార్ నాథ్, కె.కామాక్షి, బి.ప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం




లక్ష్మీపురం: ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో బంధువుల ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు శ్రీనగర్ ప్రాంతానికి చెందిన దుండి కిశోర్ రెడ్డి కార్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి డ్యూటీకి అని చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ చుట్టు పక్కల విచారించి ఫోన్, వాహనం ఇంటి వద్దనే వదిలి వెళ్లినట్లు గుర్తించారు. పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

జౌళి శాఖ నుంచి చేనేతను వేరు చేసి రక్షించాలి

మంగళగిరి టౌన్: జౌళి శాఖ నుంచి చేనేతను వేరు చేసి ప్రత్యేకంగా రక్షించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు అన్నారు. సంఘం రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా చేనేత పరిశ్రమ రక్షణకు ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో సెప్టెంబరు 11వ తేదీన పెడనలో చేనేత అధ్యయన యాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. చేనేత సహకార సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.127.87 కోట్ల బకాయిలుగా ఉన్నాయని.. వీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర కోశాధికారి మోహనరావు, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు వెంకట కృష్ణ, నియోజకవర్గ అధ్యక్షులు గిరి పాల్గొన్నారు.

మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పెద్ది రమణారావు



గుంటూరు వెస్ట్: గుంటూరు మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక బృందావన్‌గార్డెన్స్‌లోని ఓ హోటల్‌లో మంగళవారం నిర్వహించారు. ఏపీ మాస్టర్స్ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి జె.లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికలో అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పెద్ది రమణారావు, ఉపాధ్యక్షులుగా జె.రాంబాబు నాయక్, బి.సుబ్బయ్య, కార్యదర్శిగా మర్రి వెంకట సత్యనారాయణ, సంయుక్త కార్యదర్శులుగా ఎన్.శ్రీనివాస శైలేంద్రబాబు, పి.వెంకట్రావు, కోశాధికారిగా వి.ఫణికుమార్, నిర్వహణ కార్యదర్శిగా ఎస్.అఖిల్ చౌదరి, నందిగల ప్రసాదరెడ్డితోపాటు, ఇతర కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా అసోసియేట్ ప్రెసిడెంట్ పెద్దిరమణారావు మాట్లాడుతూ ఈనెల 14వ తేదీ స్థానిక ఎన్టీఆర్ స్విమ్మింగ్ పూల్‌లో కానాల అంజినీశ్రీక్రాంత్‌రెడ్డి జ్ఞాపకార్థం 8వ రాష్ట్రస్థాయి మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఆసక్తి గల క్రీడాకారులు నిర్వహణ కార్యదర్శి అఖిల్ చౌదరి 7666445566 నంబరుకు సంప్రదించాలని సూచించారు. నూతన కమిటీ ఎన్నికకు సహకరించిన అందరికి రమణారావు కృతజ్ఞతలు తెలిపారు.